# జైలు కథలు 4

## ప్రతీకార ఫలం

"దిక్కులేని వారికీ దేవుడే దిక్కు. ఆ దేవుడెపుడు కనుపించడు అదే గదా దిక్కు...."పాట మధురంగా వినిపిస్తూంది రేడియోలో నుంచి. ప్రహరీ గోడకు ఆనుకుని వొకప్రక్కగా ఏకాంతంగా ఏదో ఆలోచిస్తున్నాను.

"ఈయనే...." పరిచయం చేసిన శబ్దం విని తలెత్తాను. పరిచయం చేసిన వ్యక్తి పాత ఖైదీ. రెండవతను క్రొత్త.

"నమస్తే"....ప్రతి నమస్కారం చేశాను కూర్చున్నాడు. పరికించి చూశాను. వయస్సు 17, 18 సంవత్సరాల మధ్య వుండవచ్చు. ఇంకా యౌవనంలో ప్రవేశించని మొఖం కళ కళలాడుతూ. లేత తమలపాకులా వుంది. కళ్ళలో అమాయకత్వం పసిపిల్లవాణ్ణి తలపుకు తెస్తూంది. చదువుకున్న వాడిలా వున్నాడు.

"ఏం బాబూ" అన్నాను.

"ధర్మ వకీలు కోసం అర్జీ వ్రాసి పెట్టండి"....జైలర్ సంతకంవున్న తెల్ల కాగితం యిచ్చాడు

"ఛార్జిషీటు యిచ్చారా ?"....

"లేదు".

"విషయం చెప్పమంటారా" అన్నాడు.

"వూ" అన్నాను అప్రయత్నంగా.

.... .... .... ....

మహబూబ్‌నగర్ జిల్లా ఆలంపూర్ తాలూకా అంటే, ముఠా తగాదాలకు, రాజకీయ హత్యలకూ పెట్టింది పేరు. అదే తాలూకాలోని చిన్న గ్రామం శంకరశాస్త్రి గారిది. ఆయనకు యిద్దరాడపిల్లలు. వొక్కడే మగపిల్లవాడు. అతనేరామశాస్త్రి. నైన్త్ వరకూ చదివాడు. చదువు అబ్బలేదు. మానేసి వంశ పారంపర్యమైన అర్చకత్వం. నాటువైద్యం చేయటం ప్రారంభించాడు.

ఆ గ్రామ మోతుబరి రైతు నాగిరెడ్డి అతని ముద్దులకొడుకు భూపాల్ రెడ్డి. అతని వయస్సు 22 సంవత్సరాలు. ఆడింది ఆటగా, పాడింది పాటగా పైలా పచ్చీసుగా కాలం గడిపేస్తున్నాడు. అధికార దర్పం, ధన గర్వం. అణువణువునా జీర్ణించుకుపోయింది.

అప్పుడే యౌవన ప్రథమ సోపానంలో అడుగుపెట్టిన రామశాస్త్రి చిన్నక్క మంజులకు ఆశలు కల్పించాడు భూపాల్ రెడ్డి. ఆరాటపెట్టాడు. అందలం యెక్కిస్తానన్నాడు. నిశ్చలంగావున్న యౌవనపు సరస్సులో కోరికల అలలు రేగాయి వాటిని నిగ్రహించటం సాధ్యం కాలేదు. ఫలితం మంజుల తప్పటడుగు వేసింది. భూపాల్ రెడ్డి శరీరాన్ని సమర్పించింది. రోజులు గడుస్తున్నాయి. వారి కథ నడుస్తూంది

మంజులలో మార్పు గ్రహించారు శాస్త్రి యింటివారు. ఆమె గర్భవతి అని గ్రహించేసరికి కుటుంబం యావత్తూ తల్లడిల్లి పోయింది. పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రామశాస్త్రి కొద్దిగా లౌకికం తెలిసినవాడు ఏకాంతంలో భూపాల్ రెడ్డిని కలుసుకున్నాడు. కాళ్ళు పట్టుకున్నాడు. తన అక్క బ్రతుకు బండలు చేయవద్దని కన్నీటితో ప్రార్థించాడు. భూపాల్ రెడ్డి నిర్లక్ష్యంగా నవ్వాడు. "వైద్యం చేస్తారు మీరు, ఆమాత్రం తెలియదటోయ్ ఏం చేయాల్లో" మాటల్లోని వ్యంగ్యాన్ని గ్రహించాడు రామశాస్త్రి. గుండె పగిలింది, వళ్ళుమండింది. భూపాల్ రెడ్డి చొక్కా పట్టుకున్నాడు. కాని వయసులో, శరీర సౌష్టవంలో పెద్దవాడైన భూపాల్ రెడ్డి రామశాస్త్రిని కొట్టి వెళ్ళిపోయాడు. నిస్సహాయుడై ఇంటికి తిరిగి వచ్చాడు రామశాస్త్రి.

ఆ రాత్రి పడుకొన్న తరువాత ఆలోచించాడు. పథకాన్ని తయారు చేసుకొన్నాడు. అర్థరాత్రి సమయం వొంటిగంట కావస్తూంది. గ్రామం అంతా నిశ్శబ్దంగా నిద్రిస్తూంది. చప్పుడు కాకుండా లేచాడు. మూలనున్న గొడ్డలి తీసుకున్నాడు. భూపాల్ రెడ్డి యింటికి వెళ్ళాడు. నవారు మంచంమీద ఆదమరచి నిద్రపోతున్నాడు భూపాల్ రెడ్డి. వెనుక ముందు ఆలోచించలేదు. మొదటి దెబ్బ కుడిచేతిపై. రెండోదెబ్బ ఎడమచేతిపై వేశాడు.... రెడ్డి అరుపులకు అంతా మేలుకున్నారు. ఈలోపున రామశాస్త్రి గ్రామం దాటాడు. గొడ్డలి చెరువులో వేశాడు. అనుసరించిన వారికి అందకుండా పోయాడు

ఈ సంఘటన జరిగిన రెండో రోజు, రామశాస్త్రి ఆలంపూర్ పోలీస్ స్టేషన్‌లో హాజరయాడు. తరువాత తెలిసింది. హాస్పిటల్‌లో భూపాల్ రెడ్డి చేతులు భుజాల వరకూ తీసివేశారని.

అక్క జీవితాన్నిగూర్చి అతను పడిన ఆరాటానికి అభినందించకుండా వుండలేక పోయాను. తీర్పు...ఎలా వుంటుందో అనుకున్నాను.

—ప్రసాద్

